


# బలిదానం

## సత్యం

### (రూపవాణి, 1948 జూన్ 1 సంచిక నుంచి)

రాజశేఖరుని తన తండ్రి రామస్వామి ఇంతగా బాధించడం కమలకేమాత్రం యిష్టం లేక పోయింది. నిజంగా అతను జేసిన నేరం లేదు. ఏదో వంకతో అతన్నంత అవమానించి అంత క్రూరంగా జూడడం అన్యాయం.

రాజశేఖరునికి ప్రపంచం అంటే యేమిటో తెలుసు. అయినా నీచ ప్రపంచం కోసం అతని నడతను మార్చుకొని అతని ఆశయాలన్నిటినీ భగ్నం జెయ్యడం అతని స్వభావం గాదు. లోకులు కాకులు అని అతని తీర్మానం లేకుంటే అంత ఆదర్శపాత్రంగా తను ఆచరించిన దాన్ని దాని లక్ష్యాన్ని గ్రహించకుండానే లోకం అతన్ని గర్హించడం ఎందుకో? మహారాజా గాదు. మరి యముడే అతన్నెదుర్కొన్నా సరే తన చెల్లి వివాహం జేయడం అతను ఒప్పుకోడు.

ఆనాడు అడ్డు జెప్పని సంఘం ఈనాడెందుకు అడ్డు జెప్పుతుంది? మగడంటే ఏరుగని పసితనంలో ఆరోయేటే పెళ్ళికి అనుమతించిందే! అమ్మాయికి పదేళ్ళు వచ్చేటప్పటికి మగడు గతించాడు. ఇప్పటికి 24 ఏళ్ళు వచ్చినై. మరి బ్రతికే 84 ఏళ్ళూ ఒంటరిగా యేడవాల్సిందేనా ? 84 ఏళ్ళొచ్చిన ముసలితొక్కు 16 ఏళ్ళ పిల్లని జేసుకోవచ్చు గాని 16 ఏళ్ళ పిల్ల భర్తపోతే మళ్ళీ పెళ్ళి జేసుకోగూడదు! ఏం సంఘం! ఏం నీతులు అసలు ఈ కాలంలో గూడా సంఘం అలా పని జేస్తుంటే ఆశ్చర్యం గాదూ.

రాజశేఖరుడు తన చెల్లి పెళ్ళి జేయ నిశ్చయించుకున్నాడు. ఓ కుర్రాడు ముందుకు వచ్చాడు ఆ పిల్లను జేసుకోడానికి. సరిగా లగ్న క్షణంలో పెండ్లి అరుగుపై పీటం వేశాడు. సంఘాధికారి "ఛీ పాడు పెండ్లి నీచులు ద్రోహులు, సంఘ నాశకులు. పవిత్ర హిందూ మత సంప్రదాయాన్ని భగ్న పరుస్తున్నాడు. మీరీ పెండ్లి జూడగూడదు పొండి" అని విరుచుకు పడ్డాడు. వచ్చిన పెద్దలంతా కాళ్ళకి బుద్ధి జెప్పారు. ఏం పెద్దలో మరి "ఎలా జేసుకుంటున్నావు నీవీ పెండ్లి?" అని పెండ్లి కొడుకుపైన "వాడేలా జేస్తున్నాడు? నీవెలా జేసుకుంటున్నావే" అని కన్నీరు పర్యంతమౌతున్న పెండ్లి కూతురు పైన నూరుతున్నాడు. రాజశేఖర్ ఆగలేక పోయాడు. దుడ్డుకర్రతో ప్రత్యక్షమయ్యాడు. ఇక పెదిమ కదిల్చితే శాస్తి జరుగుతుందన్నాడు మిడి గ్రుడ్లతో పలాయనం పఠించారు సంఘాధికారులు ఒక్క అగ్ని మాత్రమే సాక్షిగా పెండ్లి జరిగింది. ఆ నాటి నుంచీ కష్టాలు మొదలు.

ఏమైనా సరే తన వివాహం కాకముందే తన అంతో సంఘం అంతో తేల్చుకోవాలని ధృఢ నిశ్చయుడయాడు శేఖరుడు. అన్నిటికి అడ్డం దిరగడం మొదలు బెట్టాడు ఎవరిని అంటుకోగూడదో వారినే అంటుకుంటాడు ఏది సంఘం చేయవద్దన్నదో అదే అతని కర్తవ్యం ఎన్నాళ్ళీలా అపవిత్రాల మయ్యామని సంఘం కూర్చుంటుందో చూడాలనుకున్నాడు. సంఘానికెంతేనా అండ వుంది. తనకేముంది ? వెధవ ఇరవై ఎకరాల భూమిదప్ప ! ఇరవై ఎకరాల అండ గూడా నాకక్కర్లేదు, నాకెవ్వరూ అక్కర్లేదు నాకు నేనే అండ. ప్రపంచ మొత్తాన్ని నేనొక్కణ్ణే ఎదురు తిరుగుతా నాకు భయం లేదు. నాకై దుఃఖించే వాళ్ళు లేరు.

నా చెల్లి, బావ దప్పు. వాళ్ళు మాత్రం ఎందుకు దుఃఖిస్తారు ? వాళ్ళు నాకు అండే, నేనొక్కణ్ణే గాదు నాలాగా మరిద్దరు ఉన్నారు. ఇంకేం గావాలి, విజయం తథ్యం" అనుకున్నాడు.

కొన్నాళ్ళతన్ని ప్రపంచం పిచ్చివాడంది "ఛీ నేను పిచ్చివాణ్ణా ? ప్రపంచం పిచ్చిది" అన్నాడతను. పిచ్చి ఆసుపత్రికి జేర్చబడ్డాడు "నేను పిచ్చి వాణ్ణి మీరు నాకు మందిచ్చేవారు" తన్నబోయాడు శేఖర్ ఆ డాక్టరుని, కాంపౌండరును; చేతులు విరిచి కట్టి మందుబోశారు లేని పిచ్చి పెరిగింది. లేని మాటలు వచ్చినై. ఫకీరు మొదలు ప్రభువువరకు అతని దాసానుదాసులట వారంతా తను జెప్పిన మాటలు వినాలట లేకుంటే ప్రపంచాన్నే భగ్నం జేస్తాడట విచ్చలవిడిగా తిరగడం మొదలు పెట్టాడు.

ఇక దారి గన్పించక జమీందారు రామస్వామిగారే కేసు విచారణలోకి తీసుకున్నారు. నిండు సభలో రాజశేఖరుని అతని చెల్లినీ బావనీ తీసుకొచ్చి నానా రభస జేసి గూళ్ళ మధ్యగా పొడిచారు దుడ్డు కర్రలతో. తప్పని ఒప్పుకుంటే క్షమిస్తానన్నారు. చెల్లీ బావ మెత్తబడ్డారు. రాజశేఖరుడు మండి పోయాడు "మీరు మనుషులు గారు పశువులు. మీరు జేసిందితప్పా ? ఎవడనేది ?... రామస్వామి గాదు ప్రపంచం తల్లక్రిందులైనా సరే నేనూ నా యిద్దరు బంధువులూ జేసింది ఒప్పు. ఇక ఈ ఉద్దేశ్యం మారదని" గద్దించాడు. అతని ఆ యిద్దరు చుట్టాలు అతనికి లోబడ్డారు. కాని ప్రపంచం లోబడలేదు. కర్రలు వాళ్ళమీద నాట్యమాడినై. నడిసభలో రక్తం ప్రవహిస్తోంది.

కమల ఇక చూడలేక పోయింది "ఏయ్ ఆపండి" అని అరచి పడిపోయింది ఆ పడిపోవడం రాత్రి ఒంటిగంటకు తేరుకుంది. శరీరం తేరుకుంది గాని మనస్సు కుదుట పడలేదు. శేఖర్ అని కలువరిస్తోంది. ఆమె పిచ్చెత్తినట్లె పోయింది. పిచ్చిలోనే ఉపన్యాసం మొదలు పెట్టింది. "ఏం? పురుషుడు చచ్చేదాకా అనుభవించాలి ? ముక్కు పచ్చలారని పసిపిల్ల మొగుడు జావగానే యిక ప్రపంచాన్ని కన్నెత్తి జూడగూడదు ? వాడు భోగించాలి ! ఇది సన్యాసం పుచ్చుకోవాలి ! ఏం మతం ! ఏం న్యాయం ! ఏం అధికారం ! ఛీ ! రాజశేఖరుని విడిచి వెయ్యండి" అంటున్నై ఆమె పెదవులు. రక్తారుణ నేత్రద్వయం రోషంతో ప్రతిబింబిస్తుండగా.

రెండుమూడు రోజులు గడిచినై. ఆమె మామూలు మనిషైంది. అసలా రాక్షస కృత్యాలు ఆగవేమో అనుకుంది, కాని ఆమె మనస్సు పరితపిస్తోంది. జైలు వైపుగా వెళ్ళింది ముగ్గురు కన్పించారు. రాజశేఖరుని పున్నమ చంద్రునిలాంటి దివ్య ముఖంలో మచ్చలు మచ్చలుగా గాయాలు కన్పిస్తున్నై. ఆమె అతన్ని ఓదార్చబోయింది. "నన్ను ఓదార్చే వాళ్ళు అక్కరలేదు. నన్ను నేనే ఉసిగొల్పుకుంటాను. నాకు నేనే పోరాడతాను నాకు నేనే విజయం సాధిస్తాను" అన్నాడు శేఖర్ అతనిదెంత ధీప్రవృత్తి! ఎంత త్యాగి ! ఎంతటి వీరుడు ! ప్రపంచంలో నిజంగా అతనే మనిషి తతిమ్మా వాళ్ళు మనుషులా? పశువులు కాదు అదేదో రూపం !

కమల చలించిపోయింది. ఎప్పుడూ జైలుదగ్గరే నిల్చుని మచ్చల ముఖంలోకి తన ముఖం పెట్టి తిలకించడం మొదలుబెట్టింది. ఆ మచ్చల్లో ఎంత భావం వుంది! ఎంత త్యాగం వుంది! ఎంత ధైర్యం ఉంది! అది మానవునికి తప్పకుండా కన్పిస్తుంది. కన్పించని వాళ్ళు మనవులు గారు తనకు కన్పిస్తుంది. గనుక తను మానవ జాతిలోది కనుకనే తన ముఖం ఆ మచ్చల ముఖం ఒకటి. ఆ రెండు ముఖాలు కలుసుకొంటై. ఆ మచ్చల ముఖానికి వచ్చిన విజయం తన ముఖమూ పంచుకొంటుంది. ఆ జైలు ప్రాంతాల కెవరు వచ్చిన కరువబోతున్నది. బలవంతాన యివతలకు తీసుకొచ్చినా అతని నామస్మరణం ఆమెకు రామనామ స్మరణం కన్నా పవిత్రంగా ఉంది.

ప్రపంచం ఆమెను గూడ పిచ్చివాళ్ళల్లో జమవేసింది. రామస్వామి దిగులు పడ్డాడు. కారణం? రాజశేఖరుడే..! అతన్ను ఈ లోకంలో లేకుండా జేస్తే?... తన కమల తనకు దక్కుతుంది. లేకుంటే ఒట్టిదే. రామస్వామికి మరో ఆలోచన తట్టింది. అతను లేకపోతే కమల గూడా ఉండదేమో! మెల్లగా కమలతో ముచ్చటించాడు. భగ్గున మండిపోయింది. కమల రాజశేఖరుడూ తనూ మనుషులట. మిగతావన్నీ అవేవో రూపాలట. రాజశేఖరుడూ తనూ ఒకటిటా. ఈ మాటలు విన్న రామస్వామికి మరీ పిచ్చెత్తింది ఏమీ తోచడం లేదు. అటూ ఇటూ ఏవేవో అనుకుంటూ తెగతిరుగుతున్నాడు. కొంచెం ఉండి తనకూ పిచ్చేమోననుకున్నాడు. ఛీ! తనకు పిచ్చేమిటి? తన కూతురుకు పిచ్చేమిటి? రాజశేఖరుడు పోతే అన్ని పోతై. ప్రపంచం శాంతిస్తుంది. తనకూ శాంతం కలుగుతుంది... అంతే ముమ్మాటికీ రాజశేఖరుణ్ణింకా బాధించాలి. తమ నీస్థితికి తీసుకొచ్చిన అతన్నింకా వదల గూడదు. అతని ముందే అతని చెల్లినీ బావనీ కాల్చేయాలి. అదీ ప్రథమ కర్తవ్యం.

అది వాళ్ళని కాల్చివేశే ప్రదేశం. ఎక్కడెక్కడి జనాలు మూగి ఉన్నై. రాజశేఖరుని బంధించి నిలబెట్టారు. అతని చెల్లి, బావా కన్నీళ్ళతో అతని ఆజ్ఞ శిరసావహిస్తూ నిల్చున్నారు. మధ్య ప్రదేశంలో కమల ఆ ప్రదేశానికే వచ్చి గలగల్లాడిపోతుంది. ఆమెనెవరో బిగబట్టి అట్టేపెట్టారు. కదలలేక పోతుంది. తుపాకీతో వధ్య శిల పై కెక్కిన వాళ్ళకి గురి చూస్తున్నారు.

రాజశేఖరుడు పట్టిన పదిమందినీ ఒక్క ఊపు ఊపాడు "ప్రపంచం పిరికిది. లేకపోతే ప్రపంచాన్నెదిరించిన ఆ యిద్దర్నీ చంపక పోతే ప్రపంచం బ్రతకలేదూ ? ఆ యిద్దరూ జచ్చినా యిదుగో ఇంకొకటి. దీనికి ప్రపంచమే బలి. నేను కన్నీరు గారుస్తాననుకున్నారా ? కన్నీరు బదులుగా రక్తం కారుస్తా. ఈ ఒక్క రక్తంతో ఏమనుకున్నారా ఏరులు పారిస్తా అంటోంది అతని ఉడుకు రక్తంతో వేడెక్కి పోయిన అతని కంఠం. రామస్వామి ఆలోచించాడు. నిజంగా ప్రపంచమే పిరికిదేమో ?... లేకపోతే ఆ యిద్దరు పోతే ప్రపంచం శాంతించదమేమిటి ?... సమాధానం కుదరక పోయినా కుదుర్చు కుంటున్నాడు ప్రపంచ ద్రోహులు వాళ్ళని కాల్చాల్సిందే.

"ఊ... కాల్చండిరా."

మళ్ళీ అరుస్తున్నాడు రాజశేఖర్ "చూడండి ఇందరున్నారుగా! నా చేతికొక తుపాకి ఈయండి. మీరంతా తలకొక తుపాకీ దీసుకోండి. ఎవరు గెలుస్తారో ? ఇస్తారా ? లేకపోతే పిరికి వాళ్ళమని ఒప్పుకుంటారా?"

సంఘాధికారి అంటున్నాడు. "అతను పిచ్చి వాడు అతని మాటలు వినాల్సిన పని లేదు ముందు శిక్ష కానీయండి."

రామస్వామి ఆలోచిస్తున్నాడు అతను పిరికివాడా ? మనమా ? ఛీ ! మనమెందుకౌతాం ? ఊ.. కాల్చండిరా.."

ధాంధాం... కాల్చారు. రెండు జీవాలయిపోయినై. ఇక ఒకటుంది. అది అంటున్నది.

"ఏ నేనిజం చెప్పానా? లేదా ? కన్నీళ్ళు కార్చానా? ఇదిగో యిక చూడండి రక్తపు కాలువ ఎంత లోతు గావాలి? ఎన్ని మైళ్ళ పొడుగు గావా ?" అతని కష్టాలు చూపించాలన్నా అవి అతనికి కన్పించడం లేదు. అసలు అవి ఆ పనంటే దడుస్తున్నై. ఇక అతన్ని పట్టుకోవడం ఎలా? ఎవరూ పట్టుకోకుండా ఉన్నారు "చూడండి రక్తపు కాలువల"ని పట్టుకున్న వాళ్ళ దగ్గర్నించి గుంజుకుంటున్నాడు "నాకు యీ ప్రపంచమే బలి" అంటోంది అతని రౌద్రమూర్తి. "అతన్నీ కాల్చేయండి" అన్నాడు రామస్వామి.

బలవంతాన అతన్ని ప్రయత్నించి వధ్య శిల ఎక్కించారు. అక్కడ నుంచి అతనినుండి బాంబులు పడుతుంటే అంతా ఛస్తున్నారు. ఎవరు జావడం లేదు ఏమిటో అంతా కల్లోలం. ఏమీ లేదు ఉలిక్కి పడుతుంది. అతనంటే ప్రజ. మరి అతని చేతిలో యేమీ లేదు. అతనింకా బందీ. లోనే ఉన్నాడు. అతను ప్రజానీకాన్నేమీ బాధించలేదు. కాని గగ్గోలు మాత్రం బయలుదేరింది. ప్రజానీకంలో శాంతే లేదు. వాళ్ళకి రక్తపు మడుగులు జూస్తున్నంత భయం గల్గింది. అందరి గుండెలు చెదిరిపోయినై "కాల్చరేం ?" అంటున్నాడు రామస్వామి.

మళ్ళీ ధాంధాం కాల్చారు. ఎప్పుడు వాలిందో కమల అతని దేహానికతుక్కొని ఉంది. రెండు దేహాలకీ గుండెల్లోగానే దూసుకు పోయింది తుపాకి గుండు. రెండు దేహాలు ఒకటిగా క్రిందపడి ఉన్నై. రెండు దేహాలు కళకళ్లాడుతున్నై, ఒకటి మచ్చల ముఖం. ఒకటి మచ్చలు లేని ముఖం. రెండూ కలుసుకొన్నై.

రామస్వామి నేత్రం చెదిరిపోయింది. అసలు యేం జరిగిందేమిటి. ? అతనికేమీ అర్థంగావటం లేదు. ప్రజ అంతా మాటుమణిగి పోయింది. కాని అతను అతని సిబ్బందీ అక్కడే ఉన్నారు.

మరునాటికల్లా రాజ్యంలో క్రొత్త క్రొత్త ఎత్తైన రాల స్తంభాలు మొల్చినై. వాటి మీద వ్రాసి ఉంది. "16 ఏళ్ళ లోపల ఎవరికీ వివాహం జేయగూడదు. బాలవిధవల పెళ్ళికి అడ్డే వారిని తలదీయిస్తాం. వివాహం విషయంలో వధూవరులదే అంతిమ నిశ్చయం !"

చచ్చిగూడ విజయం సంపాదించాడు రాజశేఖర్. అతనిది విజయాత్మ.

"తన ఆదర్శాన్ని నమ్మి, సత్య మార్గాన సాంతము వరకు ఒక్కడు నిల్చినా విజయం తథ్యం" -- మహాత్మా గాంధి.

★★★

COMMENTS